### అమ్మవారికి ప్రత్యేక పూజలు

రామాయంపేట, అక్టోబర్ 15: రామాయంపేట పట్టణంలోని మహంకాళీ ఆలయంలో మంగళవారం మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ పాండురంగాచారి వరలక్ష్మి దంపతులు అమ్మవారికి మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజు యాదవ్, చింతల రాములు, మర్కు దత్తు, పూజారి నాగరాజుచారి, సిబ్బంది యాదగిరి, సత్యం, నరేశ్, లక్ష్మి ఉన్నారు.

### ఘనంగా కలాం జయంతి

చిన్నశంకరంపేట, అక్టోబర్15: చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాజీరాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వాహన తనిఖీలు

రేగోడ్, అక్టోబర్ 15: ఎస్సీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలకేంద్రం రేగోడ్‌లో నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్సై పోచయ్య ప్రకటనలో తెలిపారు. వాహన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని, వాహనాలకు ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఆర్సీ, లైసెన్స్‌ను వాహనాన్ని నడిపే వ్యక్తులు దగ్గర భద్రపర్చుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని చెప్పారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని ఎస్సై హెచ్చరించారు.

### నిరంతరం సరఫరా చేయాలి

పాపన్నపేట, అక్టోబర్ 15: గ్రామాల్లో ప్రజలకు అంతరాయం లేకుండా నీటి సరఫరా చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో సురేశ్‌బాబు అన్నారు. మంగళవారం పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో మరమ్మతుల మెళకువలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. ప్రజలకు సరఫరాలో ఇబ్బందులు లేకుండా కృషి చేయాలన్నారు. శుక్రవారం వరకు శిక్షన కొనసాగుతున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ డీఈ విజయబాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈ సురేశ్ తదితరులు ఉన్నారు.

### ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వినతి

డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీపీసీసీ మెంబర్ కిషన్

రేగోడ్, అక్టోబర్ 15:మండలంలోని అన్ని పాఠశాలల్లో 44 పోస్టులను పూర్తిగా భర్తీ చేయాలని మంగళవారం డీఈవో రాధాకిషన్‌కు టీపీసీసీ మెంబర్ కిషన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. తక్షణమే అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఆయన వెంట చౌదర్‌పల్లి మాజీ సర్పంచ్ విఠల్ ఉన్నారు.

### ఫీజు బకాయిలు చెల్లించాలి

రామాయంపేట, అక్టోబర్ 15: ప్రభుత్వం కొంతకాలంగా డిగ్రీ కళాశాలల ఫీజులు చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం రామాయంపేటలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని పట్టణంలో ర్యాలీ చేపట్టి మెదక్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో తమ చదువులను మధ్యలోనే ముగించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

### అంత్యక్రియలకెళ్లి అనంతలోకాలకు..

చేగుంట, అక్టోబర్15: అంత్యక్రియలకెళ్లి అనంతలోకాలకు వెళ్లిన ఘటన మెదక్ జిల్లా చేగుంట మం డలం బోనాల్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లికి చెందిన అబ్రమైన నాగులు(56) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివ్వాయిపల్లిలో బంధువు మృతి చెందగా, తన అన్న కుమారుడు మల్లేశంతో బైక్ వెళ్లి తిరిగి వస్తుండగా బోనాల శివారులో ఎదురుగా వస్తున్న గేదెను బైక్ ఢీకొనడంతో వెనుక కుర్చున్న నాగులు కిందపడి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### జూనియర్ లైన్‌మెన్లుగా గుర్తించాలి

రామాయంపేట, అక్టోబర్ 15: విద్యుత్ సబ్‌స్టేషన్లలో పనిచేసే ఆర్టిజన్లను ప్రభుత్వం రెగ్యులర్ ఆర్టీజన్లుగా గుర్తించాలని రాష్ట్ర కోకన్వీనర్ వడ్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు సంగు దుర్గేష్ అన్నారు. మంగళవారం రామాయంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సమస్యల సాధన కోసం విద్యుత్ ఆర్టీజన్లు హలో ఆర్టిజన్-చలో వరంగల్ పేరిట గురువారం జిల్లా నుంచి తరలివెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జిలు ధన్‌రాజ్, శ్యాం, రాకేశ్, ప్రవీణ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

## కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు

నర్సాపూర్, అక్టోబర్15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులకు నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం వారి నివాసాల్లో వేర్వేరుగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతో పాటు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్ రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు గౌడ్ తదితరులు ఉన్నారు.



నర్సాపూర్ రైతువేదికలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

## రైతులతో ఆర్డీవో సమావేశం

నర్సాపూర్, అక్టోబర్ 15: నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి త్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న కొంతాన్‌పల్లి, రెడ్డిపల్లి గ్రామాల రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ..సమావేశంలో చాలామంది రైతులు తమ అభ్యంతరాలను తెలియజేశారని, సర్వే కోసం విజ్ఞప్తి చేశారని వెల్లడించారు. రెడ్డిపల్లి గ్రామస్తులు కొద్దిమంది మాత్రమే హాజరయ్యారని, మరి కొంతమంది ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. మిగతా రైతులు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తామని తెలిపారనిఆర్డీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఎరువుల డీలర్లకు క్షేత్రస్థాయి శిక్షణ

రామాయంపేట, అక్టోబర్ 15: క్షేత్రస్థాయిలో ఖర్జూర పంటపై ఎరువులు, విత్తన డీలర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు రామాయంపేట వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట జాతీయ రహదారి పక్కనున్న ఖర్జూర పంటలో నూతన ఒరవడులను సృష్టిస్తున్న విషయం తెలిసిందే. రైతు పండిస్తున్న ఖరూర పంటపై అవగాహన కోసం మెదక్ జిల్లా నుంచి 40మంది ఎరువులు, విత్తన డీలర్లు, అప్రెంటిషిప్ ట్రైనింగ్ కోసం వచ్చిన వ్యవసాయ డిప్లొమా విద్యార్థులు పంటను పరిశీలించారు. రసాయనాలు ఎలా వాడాలో ఖర్జూర పండిస్తున్న రైతును డీలర్లు అడిగి తెలుసుకున్నారు. విత్తన దశ నుంచి పంట వచ్చే వరకు ఎరువుల వాడకాన్ని రైతు వివరించినట్లు వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు.

క్షేత్రస్థాయి అవగాహనకు హాజరైన ఎరువులు, విత్తన డీలర్లు, డిప్లొమా విద్యార్థులు

నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, ఎల్లంకి కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, విద్యార్థులు, సంఘాల నాయకులు

## బకాయిలు చెల్లించాలని రాస్తారోకో

నర్సాపూర్, అక్టోబర్15: మూడేండ్లుగా పేరుకుపోయిన ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ఎల్లంకి డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థులతో కలిసి రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ కార్యవర్గ సభ్యులు, ఎల్లంకి కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ముడేండ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు నిర్వహించలేని స్థితిలో ఉన్నామన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించేవరకు కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించారు. ఇందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని కోరారు. యాజమాన్యం, విద్యార్థులు చేపడుతున్న రాస్తారోకోకు ఏబీవీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్షయ్ గౌడ్ మాట్లాడుతూ..తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని, బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సాయిరాం, వరుణ్, భాను, ప్రసాద్, శ్రీశైలం, కరుణాకర్, మహేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమబద్ధీకరణ దరఖాస్తులు పూర్తి చేయాలి



క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 15: సరళీకృత చెల్లింపు పథకం(ఎల్ఆర్ఎస్) ద్వారా భూముల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆవుసులపల్లిలో సరళీకృత చెల్లింపు పథకం ద్వారా భూముల క్రమబద్ధీకరణపై అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 3,782 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలని, క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖలు సమన్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఈడీఎం సందీప్, నీటిపారుదల శాఖ ఈఈ, టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేట: సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

పెద్దశంకరంపేట, అక్టోబర్15: పార్టీలకతీతంగా పేదలందరికీ సీఎం సహాయనిధి అందజేస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని భూర్గుపల్లి గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌కు మంజూరైన రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన కుటుంబసభ్యులకు అందజేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెరుమాండ్లు గౌడ్, సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రాజు తదితరులున్నారు.

విజేతలకు బహుమతి అందజేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్

## ఉమ్మడి జిల్లాకు మంచిపేరు తేవాలి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 15: క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి మెదక్ జిల్లాకు పేరు తీసుకురావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మెదక్‌లోని గుల్షన్‌క్లబ్‌లో మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు క్రీడాకారును ఎంపిక చేశారు. ఏఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓడినంత మాత్రాన నిరుత్సాహపడకుండా గెలవడానికి ప్రయత్నించాలన్నారు. ఓటమి గెలుపునకు నాంది అని, పట్టు వదలకుండా ఆటపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు సీనియర్ న్యాయవాది జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ..భవిష్యత్తులో టేబుల్ టెన్నిస్‌లో రాణించే క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కొక్కోండ ప్రభు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు ఆనందం, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు, న్యాయవాది దుర్గారెడ్డి, హనుంతు, రవితేజ, అనిశ్ పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగతిన పరిష్కరించే రోజూవారీ లక్ష్యాలను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తహసీల్దార్లకు సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై మండలాల వారీగా తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పెండింగ్‌లో 3000 దరఖాస్తులు ఉన్నాయని, జూన్ 30 వరకు వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ధరణి దరఖాస్తులను తిరస్కరించిన పక్షంలో అందుకు స్పష్టమైన కారణాలు అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు హాజరయ్యారు.

## కుల బహిష్కరణ విధించడం దారుణం

మాట్లాడుతున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు

నర్సాపూర్, అక్టోబర్15: మండల పరిధిలోని తుజాల్‌పూర్‌లో రెండు కుటుంబాలను కుల బహిష్కరణ విధించడం దారుణమని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవర్గంలో ఒక కుటుంబానికి ఉన్న సమస్య మూలంగా మొత్తం కులం నుంచి రెండు కుటుంబాలను బహిష్కరించడం సరికాదన్నారు. గ్రామంలోని పెద్దలు, బంధువులు కలిసి ఉండాలని తెలిపినా ఆ వర్గానికి చెందిన వారు ఒప్పుకోకపోగా, వారు చేసుకుంటున్న పండుగల్లో కూడా దూరం పెట్టాలని చూడడం సరైంది కాదన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించి ప్రజల్లో ఐక్యతాభావం పెంచాలన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

చేగుంట, అక్టోబర్15: చేగుంట మండలం అనంతసాగర్ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను హైదరాబాద్‌లో మంగళవారం బాధితులు కలిసి వినతిపత్రం సమర్పించారు.402 సర్వే నంబర్‌లోని 13 ఎకరాల ఆరు గుంటల భూమిని తప్పుడు సంతకాలతో లాక్కొని చేగుంటలోని జీవీకా పరిశ్రమకు రిజిస్ట్రే చేసిందన్నారు. ప్రభుత్వం నుంచి గానీ, సంబంధిత పరిశ్రమ నుంచి గానీ ఎలాంటి నష్టపరిహారం అందలేదని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు తెలిపారు. తక్షణమే భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దండోరా శివరాజ్, రైతులు వెంకటి, లక్ష్మి, సుమిత్ర, దశరథ, కృష్ణ ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

## ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 15: డీఎస్సీ నియామకాల్లో భాగంగా జిల్లా నుంచి ఎంపికైన 269 ఉపాధ్యాయులకు మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వివిధ పాఠశాలల్లో పోస్టింగ్‌లు ఇచ్చామని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టామని, జిల్లాలో 272 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా, ముగ్గురికి అనివార్య కారణాల వల్ల పోస్టింగులు ఇవ్వలేక పోయినట్లు పేర్కొన్నారు.

**ఆలస్యంగా కౌన్సెలింగ్..**

ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ సాంకేతిక కారణాల వల్ల ప్రారంభం కాలేకపోయింది. సమస్య పరిష్కారం కావడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమయింది. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు కొంతమేరకు ఆందోళనకు గురయ్యారు.

**నాణ్యమైన గుణాత్మక విద్యను బోధించాలి**

విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్యను బోధించడంతోపాటు భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వ పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ నూతన ఉపాధ్యాయులకు సూచించారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖాధికారి రాధాకిషన్

కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు

నర్సాపూర్, అక్టోబర్15: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఎమ్మెల్యే దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతోపాటు బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మాజీమంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## మాజీమంత్రి హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు

నర్సాపూర్, అక్టోబర్15: మాజీమంత్రి హరీశ్‌రావును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం కోకాపేట్‌లోని ఆయన నివాసంలో కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతోపాటు మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, రాంచందర్, ఆంజనేయులు గౌడ్, ఫైజాన్ ఆలీ తదితరులు ఉన్నారు.

## హరీశ్‌రావును కలిసిన ప్రజాప్రతినిధులు

శివ్వంపేట, అక్టోబర్ 15: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్ కోకాపేటలోని ఆయన నివాసంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డితోపాటు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హరీశ్‌రావును కలిసిన శివ్వంపేట బీఆర్ఎస్ నాయకులు

## చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

మెదక్ చౌరస్తా అక్కన్నపేట బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై

రామాయంపేట, అక్టోబర్ 15: చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రామాయంపేట ఎక్సైజ్ ఎస్సై విజయ్‌సిద్ధార్థ అన్నారు. మంగళవారం పట్టణంలోని మెదక్ చౌరస్తా అక్కన్నపేట బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎవరైనా వాహనాల్లో గంజాయి, నాటుసా, గుడుంబా తదితర వస్తువులు తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న శివదయాల్

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామాయంపేట, అక్టోబర్ 15: సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర వైద్యారోగ్య శాఖ విధాన పరిషత్, కోఆర్డినేటర్ డాక్టర్ శివదయాల్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటలోని ప్రభుత్వ దవాఖాన సీహెచ్‌సీని సందర్శించారు. సీహెచ్‌సీలో రోగుల గదులను, అవుట్ పేషంట్, ల్యాబరేటరీ, మార్చురీ తదితర వాటిని పరిశీలించి డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ శివదయాల్ మాట్లాడుతూ...దవాఖానలో రోగులకు విధానపరమైన సేవలు అందిస్తేనే వైద్యులుగా గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ దవాఖానలో డెలివరీ కేసులు పెంచాలన్నారు. దవాఖానను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, అంబులెన్సులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ లింబాద్రి తదితర వైద్య సిబ్బంది ఉన్నారు.

ఫారాలు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

## ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలు పంపిణీ

నర్సాపూర్,అక్టోబర్15:మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం దరఖాస్తు ఫారాలను ప్రధానోపాధ్యాయుడు విట్టల్, ఉపాధ్యాయులకు మెదక్ జిల్లా పీఆర్టీయూ ప్రధానకార్యదర్శి సామ్యానాయక్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సామ్యానాయక్ మాట్లాడుతూ..ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకొని ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఇంతియాజ్, జ్యోతి, వీరేశం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట ఉన్నత పాఠశాల తరగతి గదిలో పగులగొట్టిన బీరు బాటిళ్లు, తాళం పగులగొట్టిన తరగతి గది

## మందుబాబులకు అడ్డాగా ఉన్నత పాఠశాల

నిజాంపేట, అక్టోబర్ 15: నిజాంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాలలో తరగతి గదికి వేసిన తాళం పగులగొట్టి విద్యార్థులు కూర్చుండే బెంచీలను మందుబాబులు చిందరవందరగా పడవేసి బీరు బాటిళ్లను పగులగొట్టారు. దసరా పండుగ సెలవుల అనంతరం మంగళవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తరగతి గదులు తెరవగానే పగిలిన బీరు బాటిళ్లు దర్శనమిచ్చాయి. ఈ విషయాన్ని గమనించిన పాఠశాల హెచ్ఎం జ్ఞానమాల పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజుల క్రితమే నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుర్తుతెలియని దుండగులు టీవీని దొంగిలించారు. ప్రభుత్వ ఆస్తులు మందుబాబులు, గుర్తు తెలియని దుండగుల చేతిలో ధ్వంసమవుతున్నాయని, వాటిని రక్షించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.